


# రహదారి మీద

కరీంనగర్‌లో డాక్టర్‌ని కలిశాక రెండువారాల తర్వాత వాళ్ళ గురించి చేసిన వూహాగానం ఫలితమే ఇది ఈ నవలకి పేరు పెట్టాను. ఎంతవరకూ నిజమో నాకయితే తెలియదు.

దాదాపుగా మూడురోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వాన కొద్దిగా తెరిపినిచ్చి రెండుగంటలయింది. నక్షత్రాలు కనబడకుండా దట్టంగా నల్లటి మేఘాలు గుంపులు గుంపులుగా ఆకాశంనిండా అలుముకున్నాయి.

టేక్సీలో, డ్రయివింగ్‌సీట్‌లో కూర్చునివున్న జహంగీర్ ఆఖరి బీడీ తాగుతూ వర్షాన్ని తిట్టుకుంటున్నాడు. అదే ఆఖరుబీడీ దిగి కొను క్కోవాలి తిరిగి హైదరాబాద్ చేరుకునేదాకా కాల్చడానికి.

టేక్సీకి ఎదురుగా గుంటలో నిలిచిన వర్షం నీళ్ళవంక చూస్తూమరో ఇద్దరు పేసెంజర్స్ ఆర్.టి.సి. బస్ బయలుదేరేలోపల దొరికితేబావుండు ననుకుంటున్నాడు. ఆ బీడీ కాల్చేశాక టేక్సీదిగి మరో ఇద్దరు పేసెంజర్ల కోసం మళ్ళీ ప్రయత్నించాలనుకుంటుండగా, వెనకసీట్లో కూర్చునున్న తను అడిగాడు జహంగీర్‌ని కొద్దిగా విసుగ్గా.

ఇంకా ఎప్పుడు బయలుదేరేది?"

"వెళ్ళిపోదాం"అన్నాడు జహంగీర్ బీడీని బయటికి విసిరేస్తూ.

"పేసెంజర్స్ ఇంకా కావాలంటే దిగి బస్‌కోసం నిలబడివున్న

వాళ్ళని అడుగు. అక్కర్లేదనుకుంటే బయల్దేరుదాం. ఎంత సేపు? కసిరా డతను.

"ఒకసారడిగాను, ఎవరూ రమన్నారు." జహంగీర్ పక్కనే ముందు సీట్లలో కూర్చునివున్న ఇద్దరుమాత్రం నిర్వికారంగా. మౌనంగావి తొందరాలేనట్లుగా కూర్చున్నారు ఎదురుగా అద్దంలోంచి బయటికి చూస్తూ

జహంగీర్ టేక్సీ తలుపు తెరుచుకుని కిందకి దిగాడు. హవాయి చెప్పులు తొడుక్కున్న పాదాలకి నీళ్ళు చల్లగా జివ్వున కత్తిలా తగిలాయి.

"త్వరగా రా" అన్న మాటలు వినపడ్డాయి వెనకసీట్లోంచి, తలుపు మూస్తున్న జహంగీర్‌కి.

జహంగీర్‌కి చలిగాలి రివ్వున తగులుతోంది. ఆప్రదేశానికి రావల్సి వచ్చినందుకు తనను తనే తిట్టుకుంటూ ఓ సారి చుట్టూచూసాడు. చుట్టు ప్రక్కల అక్కడక్కడ వున్న రెండు మూడు పాకల్లో వెలుగుతున్న పెట్రోమాక్స్ దీపాలకాంతి మాత్రం పడుతోంది.

అంతకుముందురోజు రాత్రివచ్చిన ఆర్.టి.సి. బస్ ఓ మూలగా వుంది. డ్రయివర్. కండక్టర్, లోపల పడుకుని నిద్రపోతున్నారో, ఇంకె క్కడికయినా వెళ్ళారో తెలియలేదు జహంగీర్‌కి. ఇంకోగంటలో బయ బయల్దెరుతుందా బస్ హైదరాబాద్‌కి. తను ఈ లోపలే బయలుదేరాలి.

"గోదావరి ఖనికి ఇంకెప్పుడు రాను" అన్నుకున్నాడు జహంగీర్. రెండు అడుగులు వేయగానే, చెప్పులోంచి పాదంలోకిదిగిన రాయితాలూకు బాధని అణుచుకుంటూ.

పెట్రోమాక్స్ లైటు వెలుగుతున్న ఓ పాకలోకి వెళ్ళాడు జహం గీర్. గళ్ళలుంగీ, తెల్లటి గడ్డంతో వున్న ఓ ముసలాయన చేత్తో తిప్పు తున్నాడు గాలిమర. గాలిమరలోంచి గాలి బయటికి వచ్చేచోట కణకణ లాడుతూ ఎర్రగా కాలుతున్నాయి. రాక్షసిబొగ్గుముక్కలు. తెల్లగా పొగ వస్తోంది కాలుతున్న బొగ్గులోంచి ఆ నిప్పుమీద వున్న జర్మన్ సిల్వర్ కెటిల్‌లో మరుగుతోంది టీ.

జహంగీర్ వేడికోసం ఆ పొయ్యి దగ్గరికి జరిగి, అడిగాడు.

"చాయ్ హై క్యా?"

"హై"

"ఏక్ దా దో"

ముసలాయన ప్రక్కనే కూర్చున్న ఓ పదహారేళ్ళ కుర్రాడు గాజుగ్లాసులోకి వంచి ఆ కెటిల్‌లోని టీని అందించాడు జహంగీర్‌కి.

జహంగీర్ టీ త్రాగుతూ చూసాడు అదే చూరుక్రింద ఓ మూల నిలబడి వున్న నలుగుర్ని. వాళ్ళని, చేతుల్లోని సూట్‌కేస్‌లని గమనించి వాళ్ళు ప్రయాణీకులుగా గ్రహించాడు.

వాళ్ళలో ఒక ముసలాయన తన చేతిలోని ఖాళీటీగ్లాస్‌ని చిన్నచెక్క బల్లమీద వుంచుతూ అడిగాడు టీ దుకాణం కుర్రాణ్ణి.

"అదేం బొగ్గు? రాక్షసి బొగ్గు కదా?"

"అవును"

టీ దుకాణం కుర్రాడు మాట్లాడలేదు. ఆ నలుగురిలో ఉన్న మరో వ్యక్తి సమాధానం ఇచ్చాడు ప్రశ్నించినతనికి.

"రాక్షసి బొగ్గు ఖరీదు అవదూ?"

"ఇక్కడ వూరికే దొరుకుతుంది."

"వూరికేనా?" కొద్దిగా ఆశ్చర్యంగా అడిగాడు ఆ ముసలాయన సమాధానం చెప్పినతన్ని.

"అవును. మీరు ఎఫ్. సి. కి వచ్చారుగదా." అడిగాడు ఆ పాతికేళ్ళ యువకుడు ఆయన్ని తేరిపార చూసి.

"అవును మీ కెలా తెలుసు?"

"మీరు ఇంజనీర్ కదా?"

"కరక్ట్. మీరు ఏఫ్. సి. ఐలో పని చేస్తున్నారా?"

"అవును"

"ఎ డిపార్ట్‌మెంట్?"

"నేను వార్నర్ స్ట్రక్చరల్స్‌లో సీనియర్‌ని. సివిల్ కంట్రాక్ట్‌పని మీద వచ్చాను"

జహంగీర్ ఖాళీ టీగ్లాస్ చెక్కబల్లమీద పెట్టి, పదిహేనుపైసలు అందించాడు. కాసేపు మౌనంగా వుండి అడిగాడు వాళ్ళిద్దరినీ.

క్యాసాబ్. హైద్రాబాద్ జారాహై?"

వాళ్ళిద్దరూ సమాధానం చెప్పకుండా చూశారు జహంగీరువంక.

"గాడీహై సాహెబ్. చలో. జల్దీ జాసక్తై"

"టాక్సీ వుందా?" అడిగాడు పాతికేళ్ళ యువకుడు జహంగీర్‌ని.

"అవును. జల్ది చేరుతాం. వస్తారా? రెండేసీట్లు ఖాళీ వున్నాయ్"

"ఎంత?" అడిగాడు ఇంజనీర్ జహంగీర్ తొడుక్కున్న ఖాకీ రంగు బట్టలవంక చూస్తూ.

"పంద్రా రుపయ్"

"పదిహేనే? చాలా ఎక్కువ" అన్నాడు ఆ యువకుడు వెంటనే.

"క్యాసాబ్. పెట్రోల్ ఖరీద్ బఢ్‌గయే, రెండు రూపాయలేగా ఎక్కువ ఇచ్చేది మీరు" అన్నాడు జహంగీర్.

"కోన్‌సా గాడీ?" అడిగాడా ముసలాయన— ఇంజనీర్ బ్రీఫ్‌కేస్ అందుకుంటూ.

"అంబాసిడర్ హై సాబ్ ఫస్ట్‌క్లాస్ గాడీ. సెవెంటీటూ మోడల్, చలోసాబ్."

జహంగీర్ ఇంజనీర్ చేతిలోని బ్రీఫ్‌కేస్ అందుకోబోయాడు.

"ఠైరో. ఆలస్యం చేయకూడదు. వెంటనే బయలుదేరాలి మరి" ఆయన చేతిని వెనక్కి తీసుకుంటూ అన్నాడు.

"అచ్ఛీబాత్‌సాబ్" అన్నాడు జహంగీర్.

"వెనకసీట్ ఇవ్వాలి విండోదగ్గర"

"అచ్ఛీబాత్‌సాబ్, చలో"

ఇంజనీర్ చేతిలోని బ్రీఫ్‌కేస్ అందుకుని అన్నాడు జహంగీర్

ఆ యువకుడితో. "ఆప్ భీ చలో సాబ్. జల్దీచలేంగే. సాడేనౌకు హైద్రా బాద్ జానక్తే."

"మీకు తెలియదండీ. అసలే వర్షం మూడు రోజులనుంచి. టేక్సీ ఎక్కడయినా చెడిపోతే ఇబ్బంది పడిపోతాం మధ్యదారిలో. ఆర్. టి. సి. బస్‌లో అవుతే రిలీఫ్ బస్ వస్తుంది"

"ఇస్పేర్ టైర్ హై సాబ్ మేరేపాస్. "ఫికర్ మిత్ కరో, చలియే అన్నాడు జహంగీర్ నడుస్తూ.

"పోదాం పదండి. ఏంకాదు. నేను చాలాసార్లు ప్రయాణం చేశాను టాక్సీలో" ధైర్యం ఇచ్చాడు ఇంజనీర్ ఆ యువకుడికి.

"ఇంకోగంటాగితే ఎలాగయినా...."

"ఎంతత్వరగా హైద్రాబాద్ చేరగలనా అని చూస్తున్నాను. పదిన్న రకి హైద్రాబాద్‌లో వుండాలి నేను మీ ఇష్టంమరి"

ఇంజనీర్ ముందు, కొద్దిగా అయిష్టంగానే వెనకాల ఆ యువకుడు కదిలారు. అప్పటికే జహంగీరు వెనకాల డిక్కీ తెరచి బ్రీఫ్‌కేస్ లోపల పెడుతున్నాడు. ఆ యువకుడి చేతిలోని ఏర్‌బేగ్ కూడా అందుకుని డిక్కీలో పెట్టి, డిక్కీ మూసాడు జహంగీరు.

"హైదరాబాద్ చేరాకే నీకు పదిహేను రూపాయలు ఇచ్చేది" అన్నాడు ఆ యువకుడు.

"ఆప్‌కీ మర్జీ. బైఠియే గాడీమే" అన్నాడు జహంగీరు వుత్సా హంగా డిక్కీమూసి తాళంవేస్తూ.

"పెద్దపల్లిలో ఆపాలి అయిదునిమిషాలు. జామకాయలు కొనుక్కో వాలి"

జహంగీరు వెనకసీటు తలుపు తెరిచాడు. ముందర ఆ యువకుడు వెనకాల ఇంకనీరు కూర్చున్నారు ఇంజనీరు టేక్సీలో డ్రయివరుకాకుండ అయిదుగురున్నట్లు గ్రహించాడు. తలుపుమూసి, తలుపు పడలేదని గ్రహించి తెరచి, మళ్ళీ గట్టిగా మూసాడు. ఈసారి తలుపు పడింది.

"అబ్బీ అతాసాబ్" అని జహంగీరు మళ్ళీ టీ దుకాణంవైపు వెళ్ళాడు.

"ఇంకెవర్నయినా ఎక్కిస్తాడేమో మళ్ళీ" అన్నాడు ఆ యువకుడు లోపల ఇరుకవుతుందని భయపడుతూ.

"ఇంకెవర్నయినా ఎక్కించేటట్లయితే దిగిపోతాను నేను" అన్నాడు అంతదాకా మౌనంగా, వెనకసీట్‌లో వాళ్ళప్రక్కన కూర్చున్నతను. ఇంకెవర్నీ ఎక్కించడని అతని ధైర్యం.

జహంగీరు పావలపెట్టి బీడీలు కొనుక్కుని, ఓ బీడీ వెలిగించి చూసాడు చుట్టూ. చిన్నచిన్న బడ్డీకొట్లన్నీ మూసివున్నాయి. వుదయం కాని తెరువరు వాటిని. కేవలం టీస్టాల్స్ మాత్రమే తెరచివున్నాయి. సన్నగా ఇంకా జల్లు పడుతూనే వుంది.

వచ్చి టేక్సీ తలుపుతెరచి, స్టీరింగ్‌వీల్ ముందు కూర్చున్నాడు జహాంగీరు. అప్పటికే నాలుగు దమ్ములు లాగడంవల్ల బీడీని పారేశాడు బయట.

"అరాంసే బైఠో" అన్నాడు ఇగ్నిషన్ కీ త్రిప్పుతూ. చకచకా బండిని స్టార్ట్‌చేసి, గేర్ వేసి పోనించాడు.

టేక్సీ స్పీడ్ అందుకోగానే ఇంజనీరు తలుపుకున్న విండోగ్లాస్ పేన్‌ని కిందకి దింపాడు గాలికోసం. సద్దుకుని మరికాస్త విశ్రాంతిగా కూర్చొన్నాడు.

అయిదు నిముషాలయినా కాకుండానే టేక్సీ మట్టిరోడ్డుని వదలి ట్రంక్‌రోడ్ మీదకి వచ్చింది. దృష్టినంతా ఎదురుగా తారురోడ్ మీదకి కేంద్రీకరించి, వేగంగా, జాగ్రత్తగా, రెండు హెడ్‌లైట్లకాంతిలో రోడ్‌ని చూస్తూ నడుపుతున్న జంహాంగీరుకి వినిపించాయి ఇంజనీర్ మాటలు.

"ఫర్వాలేదు. బాగానే లాగుతున్నాడు. అనుభవం వున్న చెయ్యి లాగానే వుంది.

చిన్నగానవ్వుకున్నాడు జహంగీర్. తనకి ముప్ఫైతొమ్మిదేళ్ళనిండు

తున్నాయి. పదిహేడేళ్ళనుంచి నడుపుతున్నాడు కార్లని. ఇవాల్టికి సరిగా పదిహేడేళ్ళు తనకి లైసెన్స్ వచ్చి. జహంగీరుకి కొద్దిగా గర్వంలాంటి భావన కలిగింది.

తన స్వంతబండి అందులో. అయిదురోజులలో ఈ బండి తన స్వంతమయిపోతుంది పూర్తిగా. ఇంక వెయ్యిరూపాయలదాకానే వుంది చెల్లించాల్సిన డబ్బు. తర్వాత ఇక ఇన్‌స్టాల్‌మెంట్స్ కోసం, వచ్చిన రాబడిలోంచి దాయక్కరలేదు. వచ్చేరాబడి అంతాతనదే.

వెనకాల సీట్లో కూర్చున్న వాళ్ళు మాట్లాడుకోవటంతో జహంగీర్ ఆలోచనలకి అంతరాయం కలిగింది.

"నా పేరు శ్రీహరి మీ పేరు?" అడిగాడు శ్రీహరి– ఆపాతికేళ్ళ ఎఫ్. సి. ఐ వుద్యోగి ఇంజనీర్‌ని.

"చిరంజీవి"

"మీరు సైట్‌కివచ్చి చాలాతక్కువకాలం అయిందనుకుంటాను. ఇదివరకెప్పుడు చూడలేదు మిమ్మల్ని"

"అవును. ఇంతకుమునుపు సింద్రీలో కాంట్రాక్టు వుంది. అది పూర్తిచేసుకునే వచ్చాను"

"మీకు చాలా సర్వీస్ వుందనుకుంటాను" అడిగాడు శ్రీహరి.

ఆయన లీలగా నవ్వడం గమనించాడు శ్రీహరి, దూరంగా ఎదురుగా వస్తున్న ఓలారీ హెడ్‌లైట్లకాంతిలో.

"ముప్పై ఏళ్ళపైనేవుంది"

"ముప్పైఏళ్ళనుంచీవార్నరు స్ట్రిక్టర్సులోనే పనిచేస్తున్నారా?"

"అవును"

"మీరొక్కరేనేమో అంతకాలంనుంచి పనిచేసేది దాంట్లో?"

"మరో ఇద్దరున్నారు.... నాకన్నా రెండేళ్ళు జూనియర్సు అనుకోండి."

"ఇక్కడ పని పూర్తయ్యాక మీకు కొంతకాలం పని ఇవ్వకుండా విశ్రాంతి ఇస్తారా?"

"ఊహూ తర్వాత మళ్ళీ ఎక్కడ కంట్రాక్టు కుదిరితే అక్కడికి పంపిస్తారు. మాకు వో చోటంటూ వుండదు. మీలాగా ఓ ఆఫీస్ అంటూ వుండదు, అంటిపెట్టుకుని వుండటానికి. సైట్‌కివెళ్ళి పని పూర్తిచేయాలి. ఆ తర్వాత మరో సైట్‌కి. అలా, అలా తిరుగుతూనే వుండాలి. జిప్సీల లాగా నన్నమాట."

"ఈ ముప్పైఏళ్ళనుంచి అలా తిరుగుతూనేఉన్నారా?" శ్రీహరికి నిజంగా ఆశ్చర్యం వేసింది.

"తిరుగుతూనే ఉన్నాను పెద్ద కంట్రాక్టు అయితే ఒకటి, రెండు సంవత్సరాలదాకా అక్కడే వుండచ్చు, లేకపోతే అయిదారు నెలలు అంతే."

"చాలాచోట్లు తిరిగివుంటారయితే మీరు"

"భారతదేశంలో కాశ్మీర్ తప్ప ,మిగిలిన చోట్లన్నీ తిరిగాను బళ్ళారిలోకూడా రెండేళ్ళు పని చేశాను ఆంధ్రప్రదేశ్, మద్రాస్‌రాష్ట్రం నుంచి విడిపోకముందు, రాయలసీమలో ఆరునెలలున్నాను మళ్ళీ ఇదే రావటం"

శ్రీహరి ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాడు. చిరంజీవి మాట్లాడే తెలుగులో కొద్దిగా యాస ఉండటం అంతకుముందే గమనించాడు. కారణం ఇప్పుడు తెలిసింది.

అందుకే మీ తెలుగులో యాసవుంది."

"మళ్ళా నవ్వాడు చిరంజీవి. చీకట్లో ఆ నవ్వు కనిపించలేదుగాని శ్రీహరికి వినిపించింది.

"మీ తెలుగువాడ్నికాను. మరాఠీ నా మాతృభాష. ఏ ప్రాంతానికి వెళ్ళినా కూలీలలో మీ తెలుగువాళ్ళు ఎక్కువ. తెలుగు నేర్చుకున్నాను. వద్దనుకున్నా వచ్చేభాషలు నాలుగు నా వృత్తిలో వుండేవాళ్ళకి. తెలుగు,

మళయాళం, అరవం, హిందీ ఈ నాలుగు భాషలు మాట్లాడే ప్రాంతానికి చెందిన కూలీలు ప్రతి ప్రాజెక్టులో తప్పని సరిగా ఉంటారు.

"మరి మీకు పెళ్ళవలేదా?"

"అయింది"

"మీ సంసారం కూడా తీసుకు వెళతారా?"

"సంసారం అంటూ ఏమీలేదు. అరవై ఆరులో నా భార్య పోయింది. చివరిసారి అరవయి ఆరు మొదట్లో చూశాను. నవంబరులో పోయింది. వారంరోజుల తర్వాత తెలిసింది ఆ సంగతి. చండీఘర్‌లో ఉన్నాను అప్పుడు. ఇంకెవరో దహనం చేశారు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్దకొడుకు ఢిల్లీలో డాక్టర్. కౌలాలంపూర్‌లో ఉండేవాడు ఇంతకాలం. సంవత్సరంక్రితంవచ్చాడు ఢిల్లికి రెండోకొడుకు కూడా డాక్టర్. హైదరాబాద్‌లోవున్నాడు ప్రస్తుతం. కూతురు కెనడాలో వుందిఅల్లుడితో. అల్లుడు అక్కడ ఎడ్మింటన్‌లో ఆల్‌బెర్‌టా యూనివర్శిటీలోప్రొఫెసర్ ఇన్ కెమిస్ట్రి."

కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు శ్రీహరి తను విన్న దంతా జీర్ణంచేసుకుంటూ. మనసుకి ఎక్కడ అడిగాడు చిరంజీవిని.

"మరి వాళ్ళు చదువుకునే రోజుల్లో మీరంతా కలిసే వుండేవారా?"

"హాస్టల్‌లో ఉండేవాళ్ళు, శెలవుల్లో నేను ఎక్కడవుంటే అక్కడికి వచ్చేవాళ్ళు, స్నేహితుల ఇంటికి వెళ్ళి శెలవలు గడపకపోతే"

"ఏ స్ట్రేంజ్ వే అఫ్ లైఫ్"

"కాదు. టిప్పికల్ వే అఫ్ లైఫ్" అన్నాడు చిరంజీవి చిన్నగా నవ్వి.

"డ్రయివర్! పెద్దపల్లిలో జామకాయలు కొనుక్కోవాలి ఆపటం మర్చిపోకు" గుర్తుచేశాడు శ్రీహరి మళ్ళీ.

"మీరు ఇంటికి వెళుతున్నారా?" అడిగాడు చిరంజీవి శ్రీహరిని కాస్సేపాగి.

"కాదు కడపమాది. హైదరాబాద్‌లో ఈరోజు సాయంత్రం మా స్నేహితుడి చెల్లెలి పెళ్ళి అవుతోంది. హైదరాబాద్‌లో నా బేంక్ అకౌంట్ లోంచి డబ్బుతీసి ఐదువేలివ్వాలి వాళ్ళకి. డబ్బు సాయంత్రంలోపు అందించకపోతే పెళ్ళి ఆగిపోతుంది. నాకు తెల్లవారుజామున ప్రయాణంచేయటం అంటే పరమరోత. నిద్రవుండదు, పాడువుండదు. తప్పనిసరికాబట్టి వెళుతున్నాను ఆ పెళ్ళికోసం."

శ్రీహరి ఆమాట చెపుతూ మరోసారి తడిమి చూసుకున్నాడు. చొక్కా లోపలవున్న ఖద్దరు బనియన్ జేబులో ఒత్తుగా తగులుతున్న కవరుని, ఆ కవరులో ఉన్నాయి. అయిదువేలరూపాయలు. వందరూపాయల నోట్లు ఏభై మొత్తం. ఆ ముందురోజే బేంక్‌లోంచి డ్రాచేసి తీసుకున్నాడు అవసరమని. తన దగ్గర అయిదువేల రూపాయలున్నాయని ఆ టాక్సీలో ఇతరు లెవరికి తెలియడంలేదు ఇష్టంలేదు శ్రీహరికి డబ్బుపాపిష్టిది. అంతా కలిసి టేక్సీ ఆపి దోచుకుంటారనే అనుమానంకాదు. కాని ముక్కు మొహం తెలియని ఆ క్రొత్తవాళ్ళకి, తనదగ్గర డబ్బుందన్న సంగతి తెలియటం మంచిదికాదని.

శ్రీహరి ఆలోచనలు తన స్నేహితుడిచెల్లెలు భానుమీదికిమళ్ళాయి. భానుని తను ప్రేమించాడు. బహుశా ప్రేమ కాదది విపరీతమైన ఇష్టం, జీవితాంతం తనకితోడుగా, నీడగా భాను తనతో చివరిదాకా గడపాలనే కోరిక చాలాకాలంనుంచి ఉంది శ్రీహరికి.

భానుమీద ఇష్టం వద్దనుకుంటూనే పెంచుకున్నాడు తను. చలాకీగా ఉండే భాను అందాలరాసికాదు. సాధారణంగావుండే మామూలుపిల్ల. భాను శ్రీహరిని బాగా ఆకర్షించింది. ఆ ఆకర్షణ శారీరకంగాకాదు పూర్తిగా మానసికం.

భానుతో కాలం క్షణాల్లా గడిచిపోవు మామూలుగానే గడుస్తుంది. భానుకి తన కోరికని వ్యక్తపరచలేదు శ్రీహరి ఎప్పుడూ. తన మిత్రుడికి కూడా చెప్పలేదు, భానుని వివాహం చేసుకోవాలనివుందని.

తన మిత్రుడు విని, "సారీ బ్రదర్ వైదీకులయిన బ్రహ్మలకే తప్ప బ్రాహ్మణేతరులకి ఇవ్వము" అనటం శ్రీహరి సహించలేడు. ఈ సమయంలో తిరస్కృతిని భరించలేడు శ్రీహరి. అందుకే మౌనంగా ఉండిపోయాడు.

భాను పెళ్ళికి తప్పక అప్పు ఇస్తానని మాట ఇవ్వడంవల్ల శ్రీహరి ఐదువేలరూపాయాలతో హైద్రాబాద్ బయలుదేరాడు. "బాధపడకూడదు. నచ్చే బొమ్మలు దొరకడం అందరికీ కుదరదు. దొరికే బొమ్మమాత్రం నచ్చేలా చూసుకుంటే జీవితం హాయిగా వెళ్ళబుచ్చవచ్చు" అనే తీర్మానానికి వచ్చి బయలుదేరాడు శ్రీహరి మనసులో ఓమూల బాధ రగులుతూనే ఉంది.

తెల్లవారుఝాముున మూడున్నరఅయింది సమయం. నల్లగాచిక్కగా ఉంది చీకటి. సన్నగా వర్షంపడుతోంది బయట. జహంగీర్, వైపర్స్ తుడుస్తున్న గ్లాసులోంచి ఎదురుగా తారురోడ్డుమీదకి చూస్తూ నడుపు తున్నాడు హెడ్‌లైట్‌ల కాంతిలో వర్షంజల్లు బంగారుతీగల్లా మెరుస్తు న్నాయి.

శ్రీహరి రెండు మూడుసార్లు పలికరించాడు చిరంజీవిని, ఆయన పలకకపోవడంతో, నిద్రలోకి జారుకున్నాడని గ్రహించి వూరుకున్నాడు.

టేక్సీలో చీకటిగావుంది అప్పుడప్పుడు ఎదురుగావచ్చి టేక్సీని దాటివెళ్ళే బళ్ళ హెడ్‌లైట్ల కాంతిమాత్రం ముందు అద్దంలోంచి లోపలికిపడి చీకటిని కొన్ని క్షణాలుమాత్రం పారద్రోలుతోంది. అలా కాంతి లోపల పడ్డప్పుడు గమనించాడు శ్రీహరి ముందుసీట్లో,డ్రయివర్ ప్రక్కనకూర్చు న్నున్న ఇద్దరూ ఆడవాళ్ళని.

అర్ధరాత్రి చీకట్లోవంటరిగా అందులో టేక్సీలో ధైర్యంగా డ్రయి వర్ ప్రక్కన కూర్చుని ప్రయాణం చేస్తున్న వాళ్ళ ధైర్యాన్ని మెచ్చుకో కుండా వుండలేకపోయాడు శ్రీహరి.

అకస్మాత్తుగా శ్రీహరికి ఏడుపు వినపడింది, అది ఏడుపు అనుకో

లేదు ముందు బయట గాలిశబ్దం అనుకున్నాడు, ఇంజన్ చేసే చప్పుడు అనుకున్నాడు, మరేదో అయివుండవచ్చు అనుకున్నాడు.

స్వరం కొద్దిగా పెరగగానే చెవులు రిక్కించి విన్నాడు శ్రీహరి. ఏడుపుగా గుర్తించాడు ఆ శబ్దాన్ని. ఎవరో కావాలని వచ్చే ఏడుపుని నొక్కిపట్టి విశ్వప్రయత్నంచేస్తూ ఏడవకుండా వుండాలని ప్రయత్నిస్తున్నారు బలవంతంగా.

మరింత జాగ్రత్తగా విన్నాడు శ్రీహరి. సందేహంలేదు, ఏడుపే అది.

ఆడపిల్ల ఏడుపు అది.

ముందర సీట్లో కూర్చున ఆడపిల్ల వెక్కివెక్కి ఏడుస్తోంది. ప్రక్కన కూర్చున్న మరొకావిడ గొంతుతగ్గించి మెల్లగా ఏదోచేప్తోంది, ఆ ఏడుస్తున్న అమ్మాయికి.

ఇక ఆపుకోలేక బిగ్గరగా ఏడవసాగింది ఆ ఆడపిల్ల రెండుచేతులూ మొహానికి అడ్డంగా పెట్టుకుని. శ్రీహరికి ఏం చేయాలో తోచలేదు. "ఎందుకేడుస్తున్నారు?" అడిగాడు ముందు సీట్లోకూర్చున్న వాళ్ళనుదేశించి.

జవాబులేదు కాని ఏడుపు ఎక్కువయింది. ఆ ఏడుపు స్థాయినిబట్టి బహుశ చనిపోయిన బంధువులని చూడటానికి వెళుతున్నారేమో అనుకున్నాడు.

"ఎవరయినా....చచ్చిపోయారా మీవాళ్ళు?"అడిగాడు మళ్ళీ.

సమాధానం చెప్పలేదు ముందుసీట్లో కూర్చున్నవాళ్ళు. మళ్ళీ అడిగాడు శ్రీహరి మరి కాస్సేపాగి.

"తెలుగు అర్థంకాదా మీకు? అప్ క్యోం—"

శ్రీహరి ప్రక్కన కూర్చొనున్నతని కంఠం ఖంగుమందివెంటనే అంతదాకా అతను కోపంగా చూస్తున్నాడు శ్రీహరివంక. శ్రీహరిచూపించే ఆసక్తి నచ్చలేదు అతనికి.

"మీ కెందుకు ఆ అమ్మాయి ఎందుకు ఏడిస్తే? మాట్లాడకుండా కూర్చోండి"

శ్రీహరికి వళ్ళు జలదరించింది. అతని కంఠం వింటే. వీడుతప్పకుండా గూండా అయుండాలి! అనుకున్నాడు.

"ఖామోష్ భైఠో"గర్జించాడతను ముందుసీట్లోని స్త్రీని వుదేశించి. తక్కున ఆగిపోయింది ఏడుపు.

శ్రీహరికి ఎంతో వింతగా అనిపించింది. ఆ అమ్మాయి తన ప్రక్కన కూర్చొనున్నతనికి భయపడి ఏడుపు ఆపేయటం.

"లంబూ"పిల్చాడతను.

"ఏమిటి?"అమ్మాయికాక మరొకావిడ పలికింది బదులుగా.

తర్వాత అతనేమీ మాట్లాడలేదు.

లంబూ కూడా ఏమిటని అడగలేదు. ఆపిలుపులో ఏదో హెచ్చరిక వుండివుండవచ్చనిపించింది శ్రీహరికి. "లంబూ" అనేపేరు ఎక్కడా వినలేదు శ్రీహరి అంతదాకా. ఆ పేరుకూడా విచిత్రం అనిపించింది.

సీటుకి ఆనుకుని, నిద్రనాపుకోడానికి ప్రయిత్నించసాగాడు శ్రీహరి ఆ అమ్మాయి ఎక్కిళ్ళు వినబడుతున్నాయి లీలగా.

## 2

శ్రీహరి ప్రక్కన కూర్చునివున్న యలమంద రామగుండం వెనకబడటం చూసాడు. రామగుండంలోని థర్మల్ పవరుప్రాజెక్టు లైట్లు క్రమక్రమంగా దూరం అయిపోయాయి. టాక్సీ చాలా వేగంగా వెళుతోంది.

మరో పావుగంటలో టాక్సీ పెద్దపల్లిని కూడా దాటేసింది. పెద్దపల్లిలోని లైట్లవెలుగులో చూసాడు. యలమంద, శ్రీహరి నిద్రపోవటం. ఇంజనీరు చిరంజీవి కూడా సీటుకి చేరగిలబడి నిద్రపోవటం గుర్తించి అన్నాడు జహంగీరుతో.

"జామకాయలు కొంటానన్నాడు వీడు?"

"నిద్రపోతున్నాడా?"అడిగాడు జహంగీరు.

"లేపనా?"

"వద్దు. అసలే లేటయిపోయింది నాకు"

"మంచి చాయ్ ఎక్కడ దురుకుతుంది?"

"ఈ రూటు నాకుకూడాకొత్తే. హైదరాబాద్‌కి బాగా ఇవతల తుర్క పల్లి అని ఓ చోట వుంది అక్కడ దొరుకుతుంది. మధ్యలో కరీం నగరులో—"

"ఎంత దూరం హైదరాబాద్?" అడిగాడు యలమంద.

"మూడు వందల యాభై కిలోమీటర్లపైనే వుంటుంది. గోదావరి ఖనినుంచి. అయిదారు గంటలసేపు పడుతుంది. తొమ్మిదీ, తొమ్మిదిన్నరకి చేరుకుంటాము హైదరాబాద్"

"కరీంనగరు?"

"వుదయం ఆరుగంటలకి."

జహంగీరు ఎడంచేత్తో స్టీరింగ్ కంట్రోల్ చేస్తూ, కుడిచేత్తో జేబు లోంచి బేడీతీసి అంటించుకున్నాడు. తన ప్రక్కనున్న పదిహేడేళ్ళ అమ్మాయికి బీడివాసన అంటే ఏమాత్రం గిట్టదని తెలుసు. అయినా వెలి గించాడు బీడిని.

బీడివుంటే కాల్చకుండా ఆగటం కష్టం జహంగీరుకి. అంతేకాదు తన ప్రక్కన కూర్చున్న అమ్మాయంటే ఏవిధమైన గౌరవంగానీ, జాలి గానీ లేవు జహంగీరుకు. నిజానికి ఆ అమ్మాయిని ఇంకా ఏడిపించిచా లని బీడి పొగని ఆ అమ్మాయిమీదకి ఊదసాగాడు.

"హైదరాబాద్ నుంచి ఈసారి ట్రిప్ ఎక్కడికి?" అడిగాడు జహం గీరు యలమందని.

యలమంద మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయాడు తన ఆలో చనలలో. తన రెండువేల రూపాయలు ఇచ్చి కొన్నాడు ముందుసీట్లో కూర్చుని ఏడుస్తున్న అమ్మాయిని వారంక్రితం, పాల్ఘాట్‌లో. కేరళలో

పుట్టిపెరిగిన ఆ అమ్మాయి వంటిరంగు బంగారంలా వుంటుంది. చర్మం మిసమిసలాడుతూ, నల్లటి వంకీలజుత్తు ఒత్తుగా వుంటుంది.

గోదావరిఖనిలోకి ఆ క్రితంరోజు తీసుకువచ్చాడు. ఓ పెద్దఆఫీసరు గారి కోసం. రాను, పోను ముగ్గురికీ రైలు చార్జీలుకాక వేయి రూపాయలు ఇచ్చాడు ఆ ఆఫీసరు. తిరిగి హైద్రాబాద్ వెళ్ళిపోతున్నాడు యలమంద, వ్యాపారం ముగించుకుని.

వారంరోజులయినా ఇంకా ఆ అమ్మాయి వ్యాపారానికి అలవాటు పడలేదు. ఆ అమ్మాయి పెద్ద సమస్యగా వుంది యలమందకి. సిగరెట్ వాసన పడదు. హుషారుగా వుండదు, ఎప్పుడూ ఏడుస్తూ వుంటుంది. అక్షరంకూడా మాట్లాడదు.

యలమందకు తెలుసు కొత్తల్లో అందరూ అలానే వుంటారని. ఒకటి రెండు నెలలు గడిస్తే అలవాటు పడతారు. ఈ క్రొత్తజీవితానికి ఆరు నెలలు తిరిగేసరికి అంతా మామూలయిపోతుంది. క్రొత్తలోనే జాగ్రత్తగా చూసుకోవాలి. అందుకే జాగ్రత్తకోసం, లాంబాని కూడా తెచ్చాడు యలమంద.

లంబా యలమందకి కుడిభుజం. లంబాకి తెలుసు ఏ అమ్మాయిని ఎలా లొంగదీసుకోవాలో. యలమందకి కొద్దిగా ఆశ్చర్యంగానే వుంది ఆ అమ్మాయి పారిపోవడానికి ఇంకా ప్రయత్నం చేయకుండా వుండటం. సాధారణంగా వారంరోజుల్లో రెండు, మూడు సార్లయినా పారిపోయే ప్రయత్నం చేయటం యలమందకి అనుభవమే.

ఆ అమ్మాయిమీద పెట్టిన ఖర్చు వచ్చేస్తుంది. ఆ తర్వాత ఇంక అంతా లాభమే. మరో పదేళ్ళలో ఈ అమ్మాయివల్ల వచ్చిన డబ్బుతో ఇల్లు కట్టేసుకోవచ్చు.

గోదావరిఖనివచ్చిన వేళావిశేషం అన్నీ కలిసొస్తున్నాయి. రైలు చార్జీలతో టేక్సీలో తిరిగి వెళుతున్నారు. రైలులో లభించని హాయి టేక్సీలో దొరుకుతుంది. ఆర్. టి. సి బస్‌లోగానీ, రైల్లోగానీ అయితే "లంబా"

వంక అంతా వింతగా చూస్తారు. లంబూతోపాటే వెళుతున్న తనని, ఆ అమ్మాయినికూడా చూస్తారు అనుమానంగా.

ఆ అమ్మాయి ఏడుపునిబట్టి ముఖకవళికలనిబట్టి అందరికీ తెలిసి పోతుంది తాము ఆ అమ్మాయిని బలవంతంగా తీసుకువెళుతున్నామని. ఎవరయినా పోలీసులకి రిపోర్టు ఇస్తే మొదటికే ముప్పు.

ఆర్. టి. సి. బస్‌లో వెళ్ళాలంటే లంబూతో ఇబ్బంది. లంబూ ప్రక్కన ఎవరూ కూర్చోడానికి ఇష్టపడరు ఆడయినా, మొగయినా, ట్రిప్ లో అనుకోకుండా మరో అమ్మాయిని కొనుక్కుని తీసుకువెళుతున్నాడు. చాలా చవకలో కొన్నాడు. పదిహేనేళ్ళ అమ్మాయికి రెండువందల యాభై!

కూలీల పిల్ల అయితేనేం బావుంటుంది. మంచిబట్టలేస్తే ఆ వయసుకే పాతిక తక్కువ లేకుండా ఇస్తారు స్టూడెంట్సు.

యలమంద ఆలోచనలు రెండు నెలలయినా ఇంకా పారిపోవడానికి ప్రయత్నంచేసే ఇరవైరెండేళ్ళ మరో అమ్మాయిమీదకి వెళ్ళాయి. సికింద్రాబాద్‌లో ఓ గదిలోవున్న ఆ అమ్మాయిమీదకి మళ్ళాయి ఆలోచనలు. యలమంద మనసంతా ఆ అమ్మాయిమీదే వుంది. తప్పించుకోకుండా కట్టుదిట్టంచేసివచ్చినా ఎందుకో జంకుతోంది.

యలమంద జేబులోంచి చిన్నసంచీతీసి, ఆ సంచీలోని జర్దా తీశాడు. ఆ సంచీలోనేవున్న చిన్న సున్నం సీసాలోంచి సునాన్ని అర చేతిలోని జర్దాపొడిమీదకి వంచి సంచీని సీసాని మళ్ళీ జేబులోకి తోసేశాడు. రెండు చేతులతో సున్నాన్ని జర్దాని కలిపి కలిసిపోయేలా నలిపి. ఆ పొడిని బుగ్గన పెట్టుకున్నాడు.

యలమందకి పొగాకు నమలడం అలవాటు. అవిధంగా చిన్నప్పటి నుంచీ జర్దా నమలడం నేర్చుకున్నాడు, తమలపాకులయినా లేకుండా.

సికింద్రాబాద్‌లో మోండా సమీపంలో ఓ చిన్న ఇంట్లో ఆ ఇరవై రెండేళ్ళ నిండిన అమ్మాయిని తాళ్ళతోకట్టి అరవకుండా నోట్లో గుడ్డలు

కుక్క తలుపు తాళంవేసి వచ్చాడు, లంబూ, తను లేకపోతే ఆ అమ్మాయిని చూసుకోవడానికి ఎవరూలేరు. అందుకని ఇష్టంలేకపోయినా అలా బంధించి వచ్చాడు యలమంద. రెండురోజులు తిండిలేకపోయినంత మాత్రాన చచ్చిపోదు.

జహంగీర్ బ్రేక్‌వేసి ఆపాడు టేక్సీని చటుక్కున. ఎనభై కిలోమీటర్ల వేగంతో వెళ్ళే టేక్సీ ఒక్కసారిగా వేగంతగ్గి. పెద్ద కుదుపుతో ఆగిపోవడంతో యలమంద ఖంగారు పడ్డాడు ఆలోచనలు తెగాయి.

"ఏమిటి? ఏమయింది?" ఖంగారుగా అడిగాడు మెలకువవచ్చి చిరంజీవి జహంగీరుని.

"అటుచూడండి"

టేక్సీలో కూర్చున్న వాళ్ళంతా జహంగీరు చూపించినవైపు చూశారు.

లారీ రోడ్డుకి అడ్డంగా పడివుంది—చక్రాలు నేలమీదలేవు. గాలిలోకి లే-వున్నాయి. లారీలో లోడ్‌చేసిన సరుకు—కలప రోడ్డుమీద పడివుంది. పైన కట్టిన కేన్వాస్ బట్ట చిరిగిపోయివుంది. తాళ్ళు వూడిపోయి వున్నాయి.

"అరెరె! లారీ పడిపోయింది" అన్నాడు శ్రీహరి.

"ఓవర్‌లోడు చేయడంవల్ల మలుపు తిరుగుతూ వాలిపోయింది బరువుకి. వర్షంపలనతారురోడ్ తడిగావుంది. బలంగా బ్రేక్‌వేసి వుంటాడు డ్రయివరు. చక్రాలు జారి పడిపోయింది లారీ"

లారీ ఏవిధంగా పడిపోయి వుండొచ్చో వర్ణించి చెప్పాడు చిరంజీవి తన ఇంజనీరు బుర్ర ఉపయోగించి.

"ఇకముందుకి నడవదా మనబండి?" అడిగాడు యలమంద ఆందోళనగా.

"చూదామా? లోపల ఎవరికయినా దెబ్బలు తగిలాయేమో? అన్నాడు శ్రీహరి.

జహాంగీరు ఎవరి ప్రశ్నలకి సమాధానం ఇవ్వకుండా టేక్సీని నెమ్మదిగా పోనిచ్చాడు. లారీకి పక్కనేవున్న కొద్ది ఖాళీలోంచి. సరిగ్గా ఆ టేక్సీ పట్టేంత చోటు మాత్రమే వుంది జహాంగీరు ఆ ఖాళీ చోటులోంచి టేక్సీని అవతలకి మళ్ళా రోడ్డుమీదకి తీసుకు వెళ్ళేదాకా వూపిరి బిగపట్టి చూస్తూండిపోయాడు శ్రీహరి. జామకాయల సంగతి పూర్తిగా మర్చిపోయాడు. కొద్దిదూరం వెళ్ళి వేగం అందుకోగానే జహాంగీరు తను చూసిన అలాంటి సంఘటన చెప్పాడు ఏ ఒక్కరికీ చెపుతున్నట్లుగా కాకుండా.

చిరంజీవి అడిగాడు జహాంగీరుని.

"ఎన్ని గంటలకి చేరతాం హైదరాబాద్"

"తొమ్మిది, తొమ్మిదిన్నర" సమాధానం ఇచ్చాడు జహాంగీరు.

"నన్ను ఎయిర్‌పోర్టు దగ్గర దింపుతావా?" అడిగాడు.

"బస్ డిపో దగ్గర దింపుతాను అందరినీ. ఇళ్ళ దగ్గర దింపాలంటే సిటీలో నలభయి కిలోమీటర్లు తిరగాల్సి వుంటుంది.

"పైక అడుగుతాను ఏర్‌పోర్ట్ దగ్గర దింపు అఖరున."

"ఠీక్ హై సాబ్"

"ఏర్‌పోర్టుకి ఎందుకు?" శ్రీహరి ఆసక్తిని చంపుకోలేక అడిగాడు.

"మా అబ్బాయి ఉదయం వెళుతున్నాడు ఢిల్లీ. ఢిల్లీనుంచి మళ్ళీ నాలుగు గంటలకు బీరూట్ వెళుతున్నాడు అక్కడనుంచి మరో నాలుగు నెలలదాకా రాడు. ఏదో కోర్సుకోసం వెళుతున్నాడు స్కాలరుషిప్‌మీద వాడినిచూసి అప్పుడే సంవత్సరం అయిపోయింది.

"మీ అబ్బాయిని చూడటానికి వెళుతున్నారా అయితే?"

"అవును"

చిరంజీవి మళ్ళీ నిద్రలోకి జారిపోయాడు, కొన్ని నిముషాల తేడాతో శ్రీహరికూడా ఏదనుకుంటూనే నిద్రలోకి జారిపోయాడు లోపల బనియన్ జేబులోవున్న డబ్బుమీద చేతిని బలంగా వత్తి వుంచి.

నిద్రలో ఆ చెయ్యి జారిపోయింది వర్షం ఎక్కువయింది అకస్మాత్తుగా.

స్టేట్ బేంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన అప్పుతో కొన్నాడు జహాంగీరు ఆ అంబాసిడర్ కారుని. దాన్ని టేక్సీగా నడుపుతున్నాడు మరో వెయ్యిరూపాయలు మిగిలిపోయింది బేంక్‌కి కట్టాల్సింది. వెయ్యికట్టేస్తే పూర్తిగా టేక్సీ జహాంగీరు దయిపోతుంది.

వెయ్యిరూపాయలు కట్టడానికి ఆఖరిరోజు మరో నాలుగురోజుల తర్వాత వచ్చేది అయిదోరోజు. ఈలోపల వెయ్యిబేంక్‌కి కట్టకపోతే జహాంగీరుకు హక్కు వుండదు ఆ టేక్సీమీద. అది బేంక్ ఆస్తి అయిపోతుంది ఆ విధంగా వప్పుకునే అగ్రిమెంటుమీద సంతకంచేసే రెండున్నర సంవత్సరాలక్రితం ఆ టేక్సీని సంపాదించాడు జహాంగీరు.

దాదాపు అరువందలదాకా పోగుచేసి దాచివుంచాడు జహాంగీరు రెండునెలల సంపాదనలో. మరో నాలుగువందలు కలిపి వెయ్యి కట్టెయ్యాలి నిజానికి ఆ వెయ్యి చాలాకాలంక్రితమే కట్టాలి. కాని జహాంగీరు వాయిదాలని పొడిగించుకుంటూ వచ్చాడు డబ్బు సర్దలేనని. ఇదే ఆఖరిఅవకాశంఅని, ఇక ఆపైన మళ్ళీ వాయిదా ఇవ్వరనీ స్పష్టంగా చెప్పారుబేంక్ అధికారు.

జహాంగీరు మిగతా నాలుగువందలూ ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తున్నాడు. ఈ ట్రిప్‌లో అరవైదాకా మిగిలింది. హైద్రాబాద్‌నుంచి గోదావరిఖని వచ్చేందుకు తిరిగి వెళ్ళేటప్పుడు ఇంకా ఎక్కువ మిగిలేటట్లుంది

యేలమంద తనతో వచ్చే ముగ్గురితో కలసి మనిషికి పన్నెండున్నర రూపాయల చొప్పున ఏభయి ఇస్తాడు. మిగతా ఇద్దరి దగ్గర పదిహేను చొప్పున ముప్పై ముడుతుంది. అంటే ఎనభై. ఏర్ పోర్టుదగ్గర ఇంజనీరుని దింపితే మరో అయిదు.

పెట్రోల్ ఎంత ఖర్చు అవుతుంది. తనకి ఎంత మిగులుతుంది అని మనసులోనే లెక్క వేసుకున్నాడు జహాంగీరు.

ఎదురుగా రెండు లారీలు ఆగివున్నాయి దారి ప్రక్కన, చిన్న టీ దుకాణం ముందు వచ్చేపోయే బళ్ళ డ్రయివర్లు అక్కడ తమ బళ్ళు ఆపి టీ తాగుతారు. టీ తాగాలనిపించి అప్పుడు జహంగీరు తనుకూడా టేక్సీని ఓ ప్రక్కగా నిద్రపోతున్న శ్రీహరిని, చిరంజీవిని లేపి టీ కావాలంటే తాగచ్చని చెప్పాడు.

ఆడవాళ్ళు తప్ప అంతా కిందకి దిగారు జహంగీరు బీడీ వెలిగించి లారీ డ్రయివర్లలో తెలుస్తున్న వాళ్ళలో ఒకరితో ఏదో మాట్లాడసాగాడు టీ త్రాగుతూ.

శ్రీహరి, చిరంజీవి, యలమంద ఆ బడ్డీ టీ దుకాణంలోకి వెళ్ళారు. యలమంద ముందర రెండు గాజు గ్లాసుల్లో నీళ్ళు, రెండు కప్పుల్లో టీ తీసుకువెళ్ళి ఇచ్చాడు టేక్సీలో కూర్చున్న ఆడవాళ్ళకి.

శ్రీహరి టీ తాగాక చెప్పాడు చిరంజీవితో ఎదురుసీట్లోనిఅమ్మాయి ఏడ్చిన సంగతి, యలమంద తిరిగి రావటంతో చెప్పడం ఆపెసాడు.

టీ తాగి టేక్సీ దగ్గరకి వెళ్ళి దొంగతనంగా చూసాడు శ్రీహరి ఆ అడవాళ్ళవంక. టీ దుకాణంలోని పెట్రోమాక్స్ కాంతి వాళ్ళ మొహాల మీద పడుతోంది. శ్రీహరి పరాకయించి చూసి వులిక్కిపడి, చిన్నగా కేక వేసాడు చిరంజీవిని రమ్మని.

చిరంజీవి రాగానే చెప్పాడు శ్రీహరి గబగబా మనం పొరపడ్డాం మేష్టారు.

"ఏమిటి?" అడిగాడు చిరంజీవి ఆవలిస్తూ.

"ఆ ముందు సీట్లవంక చూడండి. ఇద్దరూ ఆడవాళ్ళుకాదా."

"ఒకడు మొగాః" అడిగాడు. ఆ కాస్త పెట్రొమాక్స్ కాంతిలో శ్రీహరి చూసినంత చురుగ్గా చూడలేక పోయాడు చిరంజీవి.

"కాదండి కాదు" అన్నాడు గుటకవేసి.

"కాదేమిటి; ఆడాకాక మొగాకాక మరింకేవ ........ మొగా, ఆడా కాని మధ్యస్థం, ఆడగొంతులా వినిపిస్తే అనుకున్నాను."

చిరంజీవి మాట్లాడలేదు.

"ఛీ ఛీ. ఎరక్కాపోయి ఎక్కాము ఈ బండి. చీకట్లో సరిగ్గా చూసుకోలేదు మనం."

"ఇంక ఇప్పుడేం చేయలేము."

"లంబూ దాని పేరు. శిఖండి బృహన్నల."

"ప్రక్కనున్న ఆ పిల్ల"

"చూస్తుంటే అనుమానంగా వుంది నాకు. ప్రోతల్స్‌లా వున్నారు."

"రామ, రామ. లేచి ఎవరిమొహం చూశానో."

ఇద్దరూ తమ పక్కకి వచ్చి నిలబడ్డ యలమందని చూసి ఉలిక్కిపడ్డారు కొద్దిగా. ఉలిక్కిపడేలానే వుంది అతని రూపం. కోర మీసం, గళ్ళ లుంగీ, తెల్లటిమాసిన పొట్టిచేతుల చొక్కా, నిద్ర లేమి వల్ల ఎర్రగావున్న కళ్ళు అజానుబాహుడు అందులో.

"కూర్చుందాం రండి" అని శ్రీహరి వెళ్ళి కూర్చున్నారు టేక్సీలో. ప్రక్కనే యలమంద ఎక్కికూర్చుని అగ్గిపుల్ల గీసాడు బీడి వెలిగించుకుంటున్నప్పుడు. ఆ వెలుగులో చూసాడు చిరంజీవి "లంబూ"ని ముందు అద్దంలోంచి.

నిజమే. మగాకాని, ఆడకాని మనిషి ముద్దులా వుంది. శ్రీహరి లంబూ ప్రక్కనే కూర్చున్న అమ్మాయి వంక చూశాడు. "వి" ఆకారంలో కత్తిరించబడిన వీపుమీద జాకెట్ మాత్రమే కనబడ్డది. పచ్చగా వుంది. వీపుమీద చర్మం పండిన దబ్బపండురంగులో.

బీడీ అంటించుకుంటూ యలమంద శ్రీహరి, చిరంజీవుల వంక చూసి నవ్వుకున్నాడు. అగ్గిపుల్ల ఆర్పి పారేసాడు బయటకి.

"అప్ జర సర్కోసాబ్" అన్నాడు జహంగీరు. చిరంజీవి ప్రక్కన తలుపు తెరచి జహంగీరు ప్రక్కన ఎవరో మనిషి నిలబడి ఉన్నాడు.

ఇంకోర్ని ఎక్కిస్తున్నావా? లాభం లేదు. ముందరే చెప్పాం వెన

కాల ముగ్గురేనని చిరంజీవి తన కోపాన్ని, చికాకునీ జహంగీర్ మీద చూపించాడు మాటల్లో. ముందుసీట్లో లంబాడిమాడగానే మతిపోయి నట్లయింది చిరంజీవికి.

"కరీంనగర్ దాకానేసాబ్, గంటలో చేరిపోతాం" బ్రతిమాలు తున్న ధోరణిలో చెప్పాడు జహంగీర్.

"లాభంలేదు. పప్పుకోను"

జహంగీర్ తలుపుమూసి, అతనితో ఏదో మాట్లాడి తన సీట్లో కూర్చున్నాడు లోపలికి బాగా జరిగి. తను ఆ అమ్మాయికి అనుకుంటూ కూర్చుని, కుడివైపు డ్రయివింగ్ సీట్లో ఖాళీ చేశాడు. కొద్దిగా ఆ క్రొత్త వ్యక్తి స్టీరింగ్ వీల్‌కి ముందు. సగం డ్రయివరు సీట్ ఆక్రమించుకుని కూర్చున్నాడు.

తలుపుమూసి, జహంగీర్ టేక్సీని స్టార్టుచేసి పోనిచ్చాడు. ముందు సీట్లో నలుగురా? ఇదన్యాయం. ఎక్కడో ఏక్సిడెంట్ చేస్తాడు. అన్నాడు శ్రీహరి చిరంజీవితో.

"ఆప్ ఫికర్ మత్ కరో సాబ్" అన్నారు జహంగీర్ శ్రీహరి నుద్దేశించి.

క్షణాల్లో టేక్సీ స్పీడు అందుకుంది. గంటకి తొంభై కిలోమీటర్ల వేగంతో వెళుతోంది ఎప్పటిలాగే.

డ్రయివరు ప్రక్కన కూర్చున ఆ కొత్త వ్యక్తికి ఎంతో సంతోషంగా వుంది. అయిదు రూపాయల్లో కరీంనగర్‌కి గంటలో చేరుకోగలడు పోలీసులకి తను తప్పించుకున్నా నన్నవార్త తెలిసి కరీంనగర్‌లోని తన ఇంటికి కాపలా వేసే లోపలే, తను కరీంనగర్‌లోని తన భార్యనికలుసుకో గలడు. కలుసుకుని క్షేమంగా తప్పుకోగలడు భార్యతోసహా. ఒకసారి బయటపడ్డాక ఇక మళ్ళా పోలీసులకి చిక్కడు ఎప్పటికి.

ఆనందం అధికం అవుతోంది. ఈ పారిపోయిన ఖైదీకి రెండేళ్ళు. తన రేండేళ్ళు జైల్లో మగ్గాడు. చివరికి తప్పించుకో గలిగాడు.

రెండేళ్ళ క్రితం తను అయ్యంగార్ల కుటుంబాన్ని హత్యచేసి సంపాదించిన విలువైన సామాను, నగలు డబ్బు అంతా భద్రంగా దాచి వుంచాడు. అది పోలీసుల కళ్ళ బడలేదు.

తనని ఎంత హింసించినా వాటిని ఎక్కడ దాచిందీ చెప్పలేదు. వినుగెత్తి పూరుకున్నారు ఇక.

రెండులక్షలు.

రెండు లక్షల రూపాయలకి తను ఇరవై నాలుగంటల్లో స్వంత దారు కాబోతున్నాడు. రెండు లక్షలే కాదు. ఇప్పుడు బంగారం ఖరీదు పెరిగిందట. రెండున్నర లక్షలు ఖరీదు చేస్తుంది. అంతా కలిసి.

హోటల్ వ్యాపారంలో వాళ్ళు గడించిందంతా తను జీవితాంతం హాయిగా అనుభవించవచ్చు. ఇక తనని ఎవరూ పట్టుకోలేని చోటికి వెళ్ళి పోవాలి భార్యతో. ఎక్కడికి? ముందర ఇల్లు చేరుకోవాలి?

ఇంకానయం. తనని వురితీయలేదు. వురి తీసివుంటే చచ్చిపోయి వుండేవాడు ఈపాటికి. ఇలా పారిపోయే అవకాశం లభించి వుండేదికాదు.

ముందర తన భార్యని కలుసుకోవాలి. తన భార్య వంటినునుపు, గోళ్ళ పదును, బిగువు.... రెండేళ్ళ....రెండేళ్ళ నుంచి మొహంవాచిపోయి వున్నాడు అన్నిటికీ, స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగు పెట్టాడు. ఇంకఅంతా స్వేచ్ఛే తనమీద ఓ కన్నువేసి వుంచే పోలీసు వుండడు.

సంతోషంతో గట్టిగా కేకలు వేయాలన్నంత పిచ్చి వ్యామోహం కలిగింది ఆ నేరస్థుడికి. కాని తమాయించుకున్నాడు.

"తాగొచ్చుగా?" అడిగాడు అతను బీడీతీసి వెలిగించుకుంటూ.

జహంగీర్ చనువుగా అతని నోట్లోని బీడీని అందుకుని తననోట్లో వుంచుకుని అన్నాడు.

"కావాలంటే ఇప్పుడు ఇంకొకటి కాల్చచ్చు."

జహంగీరుకి తెలియదు, అది "జైలుబీడీ" అనికానీ, అతను పారి

పోయిన ఖైదీ అనికానీ. తెల్సినా తన అయిదు తనకి ముడుతుంది కాబట్టి ఆ సంగతి అట్టే పట్టించుకునేవాడు కాదు.

## 3

మరోసారి జహంగీర్ టేక్సీని అకస్మాత్తుగా ఆపాడు. కాలుని ఎక్సిలేటర్ మీదనుంచి బ్రేక్‌మీదకి మెరుపులా మార్చి, బలంగా బ్రేక్‌ని వత్తుతూ, కీచుమని చప్పుడు చేసాయి కారుటైర్లు. మరోసారి వులిక్కిపడి లేచారు నిద్రపోతున్న యలమంద, శ్రీహరి, చిరంజీవి.

"బండి పైకి పోడానికి వీల్లేదు" గట్టిగా అరిచారెవరో.

శ్రీహరి చూట్టూ చూసాడు. చిమ్మచీకటిగావుంది. హైద్రాబాద్ ఇంకా ఎంతదూరమో. అసలెంతదూరం వచ్చామో తెలియలేదు. "దారిదోపిడీ ఏమో" అన్న అనుమానం కలిగిన తక్షణం చేతిని డబ్బున్న కవరుపైపు తీసుకువెళ్ళి, దాన్ని అదుముకున్నాడు ఆ చేతితో. ఇంకెప్పుడూ ఇంత డబ్బుతో, టేక్సీలలో ప్రయాణం చేయకూడదు అనుకున్నాడు. ఆ నేరస్థుడు దిగి పారిపోవడానికి సిద్ధంగా తలుపుపిడిమీద చేయివేసివుంచాడు.

"పొద్దున వచ్చాను ఇటే" చెపుతున్నాడు జహంగీర్ వుర్దూలో ఎవరితోనో.

"గండి పడింది. వెళ్ళటానికి వీలేదు."

జహంగీర్ జేబులోంచి రూపాయి నోటుతీసి అందించాడు అతనికి కిటికీలోంచి.

"అడ్డుతియ్యి. త్వరగా వెళ్ళాలి"

శ్రీహరి టేక్సీ హెడ్‌లైట్ల వెలుగులో చూసాడు ముందరికి. ఏం కనపడలేదు, అడ్డంగా వున్న ఓ వెదురు కర్రతప్ప. దానికి ఎర్రటిజండా ఒకటి కట్టివుంది.

ఆ వెదురు కర్రని అడ్డంతీసాడు, జహంగీరు దగ్గర రూపాయి లంచం పుచ్చుకున్న ఆర్. ఎండ్ బి. వాచ్‌మన్, జహంగీరు తనప్రక్కన కూర్చున్నతనితో కదలకుండా జాగ్రత్తగా కూర్చోమనిచెప్పి లాక్‌చేసాడు తలుపుని.

టేక్సీని ముందరకి పోనిచ్చాడు జాగ్రతగా. ముందేదో వుందని టేక్సీలోని అరుగురు ప్రయాణీకులకి తెలిసింది. వెళ్ళరాని చోటికి జహంగీరు లంచం ఇచ్చి వెళుతున్నాడని తెలిసింది. ముందుకు చూసాడు కళ్ళు చిట్లించి.

రెండువందల గజాలదూరం వెళ్ళేదాకా రోడ్డుతప్ప మరేం కనిపించలేదు.

ఆ తర్వాత చూసారు జహంగీరుతో సహా ఏడుగురూ, సన్నగా పడుతున్న వానచినుకుల్లోంచి. ఎదురుగా రోడ్డు లేదు, వున్నా కనపడలేదు. రోడ్డు వుండాల్సినచోట నీరు పారుతోంది. పారుతున్న ఆ నీటిమీద టేక్సీ హెడ్‌లైటు వెలుగు మెరుస్తోంది.

"గుడ్ గాడ్ అపు గండి" అన్నాడు శ్రీహరి. రోడ్డుకి రెండు వైపులా అడ్డంగా వేసిన సిమెంట్ బస్తాలవంక చూస్తూ.

జహంగీరు ఆపలేదు. కళ్ళురెంటినీ దృష్టినీ ఎదురుగా సిమెంట్ బస్తాల మధ్యవున్న నీరుపారుతున్న రోడ్డుమీదకి కేంద్రీకరించి అతినెమ్మదిగా నడుపుతున్నాడు టేక్సీని.

జహంగీరు ప్రక్కన కూర్చునివున్నతను వూపిరి బిగబట్టి చూస్తున్నాడు, రోడ్డుమీద నీటివంకా, రోడ్డుప్రక్కనే వాగులో నీళ్ళలో పడివున్న లారీవంకా పల్లంగావున్న ఆ రోడ్డుమీదకి వచ్చేసాయి వాగులోని నీళ్ళు పొంగి. నీరు ఆపడానికి అక్కడక్కడ సిమెంటు బస్తాలువేసి వుంచారు. కాని అవి నీళ్ళని ఆపలేకపోతున్నాయి, నీళ్ళురాకని కొద్దిగా అరికట్టినా.

టేక్సీలోని అంతా చూసారు స్పష్టంగా— వర్షంవల్ల పొంగిపొర్లుతున్న వాగుని, రోడ్డుమీద అడుగున్నర ఎత్తుదాకా వచ్చిన నీళ్ళని, నీళ్ళలో పడివున్న లారీని, ప్రమాదాన్ని.

అక్టోబర్‌లోని అంతచలిలోనూ చిరుచమట పట్టింది చిరంజీవి నుదుటికి. శ్రీహరి గుండె ఆగిపోయినట్లయింది టేక్సీ గండిపడ్డ రోడ్డు మీద వెళుతూంటే.

టేక్సీ నీరు పారుతున్న ఆ తారురోడ్డుమీదకి ఎక్కింది ముప్పై అడుగులదాకా వుంది ఆ ప్రమాద స్థితిలోవున్న రోడ్డు. అంతా వూపిరి బిగబట్టి చూస్తున్నారు చప్పుడు చేయకుండా.

జహంగీరు రెండుచేతులతో స్టీరింగ్ పట్టుకొని కళ్ళని ఎదురుగా కనబడే రోడ్డుమీద నుంచి తిప్పకుండా, కాలుని తయారుగా బ్రేక్‌మీద వుంచి పదికిలోమీటర్ల వేగంతో నడిపాడు టేక్సీని.

బహుశ పదిహేను క్షణాలు పట్టివుండవచ్చు టేక్సీకి ఆ గండి పడ్డ రోడ్డుని దాటటానికి. లంబూకి ప్రాణాలపైన చాలాతీపి. నీళ్ళంటే మరీభయం అందులో.

"దాటేసాం" అన్నాడు జహంగీరు స్పీడుపెంచుతూ. కాలు బ్రేక్ మీదనుంచి ఎక్సిలేటర్ మీదకి మార్చేసాడు, ఘోరపాటు జరిగితే టేక్సీ వాగులోకి పడిపోయేది" ఇటెందుకు తీసుకువచ్చావు? ఇది దారికాదు" అరిచాడు శ్రీహరి. తప్పిపోయిన ప్రమాదం తాలూకు భయాన్ని కోపంగా మార్చి అరిచాడు.

"ఇటువస్తే ముప్పయి కిలోమీటర్లదూరం తగ్గుతుంది" చెప్పాడు జహంగీర్.

"డేమిట్" అంతకంటే ఇంకేం అనలేకపోయాడు చిరంజీవి.

"ఇంకా ముందేమయినా ఇలాంటివి వున్నాయా?" గర్జించాడు శ్రీహరి.

"నయ్యేసాబ్ ఆప్ ఆరాంసే బైటియే" నవ్వాడు జహంగీర్.

చిరంజీవి ఆలోచిస్తున్నాడతను, చచ్చిపోతే ఎప్పటికీ తన కొడుకుని చూడగలిగేవాడు కాదని.

తను భాను పెళ్ళికి మాట ఇచ్చిన విధంగా, అయిదువేలు సమయానికి తీసుకువెళ్ళి ఇవ్వగలిగే అవకాశం వుండేది కాదు అనుకున్నాడు శ్రీహరి. టేక్సీ తిరగబడి ఆ వాగులో పడిపోతే తప్పక చచ్చిపోయివుండే

వాడు తను. పెళ్ళయ్యాక భానుకి ఆ సంగతి తెలిస్తే ఏమనుకుంటుంది? ఏడుస్తుందా—ఏమో? అయ్యో అనుకుంటుందా? ఏమో?

ఆ క్షణంలో నిజంగా తను నిజంగా చచ్చిపోయి వుండినా బావుండేది అనిపించింది శ్రీహరికి భాను గుర్తుకు రాగానే. గుండెలో ఏదో తెలియని బాధ రగలసాగింది మళ్ళీ

తను చచ్చిపోతే ఆ ఇరవయిరెండేళ్ళ అమ్మాయి అలాగే తన ఇంట్లో బంధితురాలయిన ఆకలికి మాడి, మాడి చచ్చిపోతుంది ఓరోజు అనుకున్నాడు ఫులమంద. ఆ విధంగా ఆ అమ్మాయిని బంధించి రావడం కూడా పొరపాటేమో అనికూడా అనిపించింది.

తను తలుపు దగ్గరే వున్నాడు. టాక్సి వాగులో పడిపోతూంటే తలుపు తెరచుకొని వాగులోకి దూకి, ఈతకొట్టి తప్పించుకొనేవాడు. మరో బండిపట్టుకొనేవాడు కరీంనగర్‌కి. తనంత తేలికగా మృత్యువుని అంగీకరించడు, ఆ పారిపోయిన ఖైదీ ఆలోచిస్తున్నాడు.

సరిగ్గా అలాగే ఆలోచించాడు డ్రయివరు జహంగీరు. తనురెండవసారి చేసిన సాహసాన్ని గుర్తుచేసుకుంటూ ఉదయం తనీదారిన వచ్చినప్పటికన్నా నీళ్ళు పెరిగాయి ఇప్పుడు, రెండడుగులపైనే ఉంది వాటర్ లెవెల్ రోడ్‌మీద ఇంకో అడుగు పెరిగితే కష్టం.

లంబూ ఏం ఆలోచించకుండా నిద్రలోకి జారిపోయింది.

టాక్సి ఎలాగయినాసరే ఆ నీళ్ళలోకి పడిపోతే బావుండునని దేవుణ్ని ప్రార్థించింది, ఆ టాక్సి మొత్తంలో లంబూ ప్రక్కనకూర్చున్న అమ్మాయి ఒక్కతే.

ఆ పదిహేడేళ్ళ కేరళ అమ్మాయి చావుకోసమే ఎదురు చూస్తోంది వారంనుంచి. ఇక బ్రతకాలనే కోరికపోయింది. ఈలోకం నుంచే నిష్క్రమించాలనే కోరిక మొదలయింది. చచ్చిపోవడానికి తగిన దారికోసం ఎదురు చూస్తోంది. వేశ్యావృత్తి ఇంత భయంకరంగాను, ఇంత ఘోరంగాను, ఇంత అసహ్యంగాను ఉంటుందని కలలోనయినా అనుకోలేదు ఆ

అమ్మాయి.పడరానిచోట్ల, పడరాని మురికి చేతులుపడి కంపరం పెంచడమే కాదు. అసలు తానొక మనిషన్న సంగతి మర్చిపోయారు అంతా. కేవలం మట్టిబొమ్మ.

ఇతరుల ఇష్టంవచ్చినట్లు తనుండాలి, తనకి జుగుప్స కలిగించినా, అలా వుండకపోవడంవల్ల వీపుమీద, మరికొన్నిచోట్ల సిగరెట్లతో కాల్చారు మానసికంగా, శారీరకంగా వూహించలేని బాధ అనుభవిస్తోంది ఈ రాక్షస ప్రపంచంలో వారంనుంచి, మాయమాటలు నమ్మి మోసపోయింది తను. ఫలితం కఠినంగావుంది. ఇంక ఇంటికి వెళ్ళకూడదు.

తను తప్పక చచ్చిపోవాలి. ఐ డోంట్ వాంట్ టు లివ్ ఎనీ లాంగర్. ఐయామ్ డెడ్. చచ్చిపోయి వారం అయింది.

మళ్ళీ గుర్తుకు వచ్చారు ఆ అమ్మాయికి తన తల్లిదండ్రులు,చిన్న చెల్లెలు తమ్ముడు.

దాచుకోలేక నిశ్శబ్దంగా రోదించసాగింది చీకట్లో.

## 4

"కరీంనగరు ఇంకో పావుగంటలో చేరతాం" చెప్పాడు జహంగీరు హుషారుగా.

క్రమక్రమంగా వెలుగురేఖలు వస్తున్నా, సూర్యుడు ఉదయిస్తున్నాడు. రోడ్డుమీద చీకటి చచ్చిపోయి, వెలుగురాజ్యం ఏలటం ప్రారంభమయ్యింది. ఉదయం ఛాయలు కనిపిస్తున్నాయి అన్నిదిక్కులా.

హెడ్‌లైట్స్ ఆర్పేశాడు జహంగీరు. అయిదుముప్పావు దాటుతోంది. జహంగీరు కరీంనగర్‌లో బస్టాండు పక్కనేవున్న ఉడిపీ హోటల్‌ముందు టేక్సీని ఆపాలని నిర్ణయించుకున్నాడు కాఫీకోసం.

వర్షంకూడా తగ్గింది. ఆకాశంలో మేఘాలు లేవిప్పుడు. నిరలంగా నీలంగావుంది ఆకాశం. దూరంగా రోడ్డు స్కేలుబద్దలా నిలువుగా కనిపిస్తోంది చాలాదూరం. రోడ్డుకి రెండువైపులా ఆకుపచ్చటి చెట్లు.

దూరంగా ఏదో రోడ్‌కి అడ్డంగా ఆగడం గమనించాడు జహంగీరు.

కళ్ళు చిట్లించి చూశాడు వెంటనే హెడ్‌లైట్స్ వెలిగించాడు. కారు.

ఓ కారు రోడ్‌కి అడ్డంగా నిలబడివుంది. కారులో ఎవరోకూర్చుని ఉన్నారు. జహంగీరు ఆలోచనగా బ్రేక్‌మీద కాలు వేశాడు. హారన్ నొక్కాడు గట్టిగా.

అయినా అడ్డంగావున్న కారు తొలగలేదు పక్కకి. స్పీడుపెంచాడు జహంగీరు వెంటనే, హారన్ కొడుతూనే అయినా తొలగలేదాకారు.

వెయ్యిగజాల దూరంలోకి వచ్చాక చూసాడు పహంగీరు ఆ కారు వంక, ఆ కారులోని డ్రయివరు వంక వెంజనే జహంగీరు మొఖం పాలిపోయింది.

"ఛాడ్కా! ఛాడ్కా" తిట్టుకుంటూ స్పీడు పెంచాడు జహంగీరు.

ఆ కారు ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌దని తెలుసు జహంగీరుకి. ఉదయం గోదావరిఖనికి వెళ్ళేటప్పుడు తన టేక్సీని ఆపాలని చూశాడు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఇదే కారు మీదవచ్చి.

తను ఆపలేదు చిక్కకుండా వచ్చేశాడు. తిరిగి వస్తాడని కారా పాడు. దొరకూడదు తను. ఇప్పుడు దొరికితే మరీ ప్రమాదం. టేక్సీలో అయిదుగురికంటే ఎక్కువమందిని ఎక్కించకూడదు. ఏడుగురున్నారు లోపల. చలాన్‌చేస్తే కోర్టులో ఏభైకి తక్కువ పడదు ఫైన్.

"ఆపు ఎదురుగా కారుంది అడ్డంగా. ఆపు" అరిచాడు యలమంద జహంగీరు వేగం తగ్గించకపోవడం గమనించి.

జహంగీరు తగ్గించలేదు వేగం.

"ఆపు"

చిరంజీవి, శ్రీహరి, యలమంద ఒకేసారి అరిచారు. అయినాలక్ష్య పెట్టలేదు జహంగీరు. ఇంకా పెంచాడు వేగాన్ని మనసులో బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ని తిడుతూ.

పెంచి అడ్డుగావున్న కారు ఇంకో పందగజాల దూరంలో వుండ నగా బలమంతా ఉపయోగించి బ్రేకు నొక్కాడు. నొక్కుతూ స్టీరింగ్ వీల్‌ని గబగబా కుడివైపు త్రిప్పి టేక్సీని కుడివైపు కోశాడు. గారడీ చూస్తున్నవాడిలా కూర్చున్నారు టేక్సీలోని ప్రయాణీకులంతా. ఎదురుగా అడ్డువున్న కారు పోలీసులది కాదని సంతృప్తిచెందాడు జహంగీరు పక్కన అంతదాకా వుగ్గబట్టుకుని కూర్చున్న నేరస్థుడు.

జహంగీర్ అతి నైపుణ్యంగా తన టేక్సీని ఆగివున్న ఆ అంబాసి డరుకారు పక్కనుంచి పోనించాడు. టేక్సీని ఆ కారు బానెట్ రాసుకుని కీచుమంది. క్షణాల్లో కారుని దాటాడు జహంగీరు.

టేక్సీ మళ్ళీ రోడ్‌మీదకి వచ్చింది "ఆపు ఆపు"

ఆ అమ్మాయితప్ప టేక్సీలోని అంతా వకేసారి అరిచారు ఎదురుగా వస్తున్న ట్రాక్టరునుచూసి. జహంగీరు తన టేక్సీని ఆ ట్రాక్టరుకి గుద్దు కోకుండా వుండాలనే ప్రయత్నంతో స్టీరింగ్‌వీల్‌ని గబగబా ఎడంవైపు తిప్పాడు. ప్రక్కన మనిషి వుండటంవల్ల జహంగీరు సరిగ్గా తిప్పలేక పోయాడు స్టీరింగ్‌ని ఆ ఇరుకులో.

సూటిగా వేగంగా వెళ్ళి ఎదురుగా రోడ్ పక్కన వున్న చెట్టును గుద్దుకుంది టేక్సీ. గుద్దుకొని పక్కకి తిరిగి రోడ్ ప్రక్కన ఉన్న పల్లం లోకి జారిపోయింది క్షణాలలో.

అదే సమయంలో ట్రాక్టరు రోడ్‌కి అడ్డంగావున్న అంబాసిడరు కారును గుద్దింది. గుద్ది దాన్ని కొంతదూరం తోసుకొంటూ వెళ్ళింది ఆగే దాకా.

అయిదారు నిముషాలదాకా కేకలతో నిండిపోయిందా ప్రదేశం. తర్వాత క్రమంగా సద్దుమణిగింది.

మరో పావుగంట తర్వాత వెనకాల వచ్చే ఓ ఆర్. టి. సి. బస్ ఆగింది. బస్‌లోంచి దిగిన జనం గబగబా సహాయానికి పరిగెత్తారు అదు ర్దాగా.

సూర్యుడు పూర్తిగా ఉదయించాడు అప్పటికే. వర్షం, చీకటి తగ్గిపోయాయి.

కాని చలిగామాత్రం వుంది ఆ రహదారిమీద.

## 5

ఉదయం తొమ్మిదీ ముప్పయ్యేడు నిముషాలయింది. కరీంనగర్‌లోని ఓ పెద్ద ఆస్పత్రిలోని గోడగడియారం తొమ్మిదీ ముప్పయేడు చూపిస్తోంది.

రహదారిమీద ఆ ప్రమాదంలో చిక్కుకున్న దురదృష్టవంతులంతా ఆ ఆస్పత్రిలో చేర్చబడ్డారు, విజిటర్స్ రూమ్‌లో కూర్చున్న వాళ్ళందరికి తెలిసిపోయింది దగ్గరలోనే ఎక్కడో ఏక్సిడెంట్ అయిందనీ ఏడెనిమిది మందిని చేర్పించారని.

ముగ్గురు నర్సస్, పెద్దడాక్టర్లు ఆ కేసులని చూస్తున్నారు.

చిరంజీవి అక్కడికక్కడే మరణించాడు జీప్‌లోనే.

జహాంగీర్ స్టీరింగ్‌వీల్ కడుపులో గుచ్చుకోకుండా రెండుచేతులూ అడ్డుపెట్టుకోవడంవల్ల రెండుచేతులూ విరిగిపోయాయి. బాధలో అరుస్తున్న అతనికి మత్తుమందు ఇచ్చి డ్రస్‌చేసి, చేతులకు బేండేజ్ కట్టారు. పెద్ద సర్జన్ పరీక్షించి చేతులు విరిగిపోయాయని ఇక అతుక్కోవడం కష్టమని చెప్పారు

జహాంగీర్ పక్కనే కూర్చున్నతనికి స్వల్పంగా తగిలాయి గాయాలు. స్పృహలేదు అతనికి హాస్పిటల్లో చేర్పించే సమయానికి.

యాలమంద ఇంకా బెడ్‌లో వుండగానే అయిదు నిముషాల క్రితం పోయాడు. చచ్చిపోయేదాకా ఏదో చెప్పాలని కొట్టుకుపోయాడు, కాని మాటరాలేదు. గుండెల్లో సీక్‌స్ప్రింగ్ దిగబడడంవల్ల సంభవించింది మరణం.

శ్రీహరి కంట్లో గుచ్చుకుంది ఏదో రాడ్. కంట్లోంచి మెదడు దాకా దిగబడిందని డాక్టర్ల అనుమానం. అపస్మారకస్థితిలోవున్నాడు బెడ్

మీద. హైదరాబాద్ వెంటనే పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద హాస్పిటల్‌లో కాని అతన్ని కాపాడలేరు ఎవరూ.

రెండుమూడుచోట్ల చిన్న చిన్న గాయాలతో తప్ప చెక్కుచెదరకుండా వున్నది ఆ కేరళ యువతి. అదృష్టవశాత్తు ఆఅమ్మాయికేంకాలేదు భయంవల్ల షాక్ తగిలినట్లయి స్పృహ తప్పింది హాస్పిటల్‌లో స్పృహ తెప్పించారు.

"లెట్ మిడై లెట్ మిడై" అని ఏడవటం మొదలు పెట్టింది. ఎందుకో ఎవరికి తెలియలేదు. ఆ షాక్‌కి మతిచెలించివుండవచ్చనుకున్నారు నర్సులు.

రెండునిమిషాల క్రితమే ఆ కేరళయువతి అతి ప్రమాదకరమయిన పేట్యూల్డు డ్రగ్ రహస్యంగా మింగింది ఆ హాస్పిటల్‌లోది. మరో పావు గంటలో ఆ సంగతి కనుక్కొని విరుగుడు ఇవ్వకపోతే, మరణంతప్పదు ఆ అమ్మాయికి.

కాని పావుగంటలో ఆ అమ్మాయి బాత్‌రూంలోంచి బయటకు రాదు. తలుపులు పగలకొడ్తారు బహుశ, ఏ పది పదిహేను గంటల తర్వాతో.

లంబూకి కుడిచెవి తెగిపోయింది. ముక్కులోంచి ధారాపాతంగా రక్తం కారింది చాలా సేపు. అంతకంటే మరేం కాలేదు. అయితే ఎడం చేతి మూడువేళ్ళు విరిగాయి.

"లంబూ" పారిపోయిందన్న సంగతి ఆ ఆస్పత్రిలో ఇంకా ఎవరూ గుర్తించలేదు. పెళ్ళికోసం తీసుకు వెళుతున్న తన అయిదువేల రూపాయలు అందరిని వెదికినట్లుగానే తననీ వెదికినప్పుడు లంబూకి దొరికాయని, లంబూ మాయమయి పావుగంటపైనే అయింది.

సహాయానికి వెళ్ళిన వాళ్ళలో చాలామందిఆశ్చర్యపోయారు. టేక్సీ లోపలే కాకుండా, డిక్కీలో కూడా ఓ ప్రయాణీకురాలు వుండటం గమ

నించి గోనెసంచిలో చుట్టబడివున్న ఆ ప్రయాణీకురాలికి పదిహేనేళ్ళుం టాయి. డిక్కీలో రహస్యంగా తీసుకువెళ్ళబడుతున్న ఆ పాపకి తెలివి లేకుండా చేసారు నల్లమందు ఇచ్చి. చదువురాని సాధారణ కూలీల తరగ తికి చెందిన దానిలా వుంది. ఒంటిమీద ఎక్కడా చిన్న దెబ్బయినా తగల లేదా పాపకి. డాక్టర్లు ఆ పాపకి తెలివి తెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. పాప డిక్కీలోకి ఎలా వచ్చిందో అర్థంకాలేదు ఎవరికీ.

ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ డిపార్టుమెంటుకి చెందిన బ్రేక్ ఇన్స్ పెక్టర్‌కి ఏంకాలేదు సమయానికి తప్పుకోవడంవల్ల. కారుమాత్రం నుగ్గు నుగ్గయింది.

ట్రాక్టర్ డ్రయివర్‌కి స్పృహ తప్పించి. ట్రాక్టర్ ముందుభాగం కొద్దిగా సొట్టపడిందంతే. ఇంకేంకాలేదు. లేచినవేళ మంచిదయింది ఇద్ద రికీ.

ఉదయం పదకొండునలభై తొమ్మిదికి ఆపరేషన్ థియేటర్‌లోంచి బయటకి వచ్చిన సర్జన్‌కి చెప్పిందో నర్స్.

"డాక్టర్ మీకోసం ఎవరోవచ్చాడు. బయట విజిటర్స్ రూమ్‌లో కూర్చున్నారు"

"ఎవరో చెప్పాడా?" అడిగాడు ఏభై నిండుతున్న ఆ డాక్టర్ బేసిన్‌లో మోచేతులదాకా నీళ్ళతో చేతులు కడుక్కుంటూ.

"మూర్తి అని చెప్పాడు హైదరాబాద్‌నుంచి వచ్చాడట ఏదో పని మీద."

"చూస్తాను పేషంట్ బి పి చెక్‌చేసి రెయిజ్ ఐతే నాకు చెప్పండి విజిటర్స్ రూమ్‌లో ఉంటాను."

డాక్టర్ విజిటర్స్ రూమ్ గుమ్మందగ్గర ఆగి, కూర్చున్న విజి టర్స్‌వంక చూశాడు. నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ.

ఓమూల కుర్చీలో కూర్చుని ఆరోజు పేపరులోని క్రాస్‌వర్డ్ పజిల్‌ని

పెన్సిల్‌తో నింపుతున్న ఓ ముప్పైఏళ్ళ లోపు యువకుడు లేచి నిల్చుని డాక్టర్‌కి నమస్కారం చేశాడు మర్యాదగా.

"హలో నువ్వా? ఎప్పుడు రావటం? నా గదిలోకి వెళదాం పద" అన్నాడు డాక్టర్ ఆ యువకుడ్ని గుర్తుపట్టి.

* * *

రెండు గంటలనుంచి డాక్టర్‌కోసం ఎదురుచూస్తున్న నాకు డాక్టర్ కనబడగానే కొద్దిగా సంతోషంవేసింది. పెన్సిల్ చేతిలోని పేపరు పడేసి నిల్చున్నాను, కాలక్షేపంకోసం క్రాస్‌వర్డ్ పజిల్స్ నింపుతున్నాను అప్పటి దాకా. లేచి నమస్కారం చేశాను డాక్టర్‌కి వెంటనే.

ఇద్దరం డాక్టర్ గదిలోకి వెళ్ళాం నేను వచ్చినపని చెప్పేంతలో నర్స్ హడావుడిగా వచ్చి అన్నది డాక్టరుతో.

డాక్టర్ బి పి పెరిగింది పేషంట్‌కి."

డాక్టర్ నర్సుకి యేంచేయాలో చెప్పి పంపివేసి నావైపు తిరిగి చిరునవ్వుతో నవ్వారు.

"ఆపరేషన్ చేస్తున్నారని చెప్పింది నర్స్ ఇందాక. సక్సెసేనా?" అడిగాను.

"ఇంకో నాలుగు గంటలు గడిస్తేగాని తెలియదు" అన్నారు ఆయన.

ఏదో ఏక్సిడెంట్ అయిందిటగదా దగ్గరలో? ఎలా జరిగింది?" అడిగాను.

"ఏం పనిమీద వచ్చావు నువ్వు?" అడిగారాయన.

"ఆమధ్య ఓసారి రాజమండ్రి వెళ్ళాను. అప్పుడు మీ అబ్బాయి గారింటికి వెళ్ళాను. లోన్ సేంక్షన్ ఐందని మరో నెలరోజుల్లో ఇల్లు కట్టడం మొదలు పెట్టాలని చెప్పమన్నాడు ఈ సమస్యకు ఆరంభం.... ఇందాక ఎక్సిడెంటు గురించి అడిగావుకదూ?" అడిగారాయన.

అవునన్నట్లు తలవూపి చెప్పాడు.

"బయట పేషంట్లు మాట్లాడుకుంటుంటే విన్నాను."

"లాలా పెద్ద యాక్సిడెంట్, టేక్సీలో వస్తున్నారు. గోదావరిఖని నుంచి అనుకుంటాను. అందులో ప్రయాణీకులు ఎవరో ఎక్కడివాళ్ళో ఇంకా తెలియదు."

నేను లేచి నిలబడ్డాను.

"వెళ్ళొస్తాను సార్. వేములవాడ వెళుతూ ఇటొచ్చాను."

ఆయన ఆప్యాయంగా నా భుజం తట్టి గుమందాకా వచ్చారు.

"కొత్త కథలేమయినా రాస్తున్నావా?" అడిగారు. రచయితగా కూడా నేనాయనకి పరిచయం.

"కొత్తప్లాటు కోసం వెదుకుతున్నాను" జవాబు చెప్పాను.

వేములవాడ వెళ్తే దారిలో దాదాపు రెండు గంటలసేపు నేను విన్న ఆ ఏక్సిడెంటు గురించి ఆ ఏక్సిడెంటుకి గురయిన వాళ్ళగురించి ఆలోచిస్తూనే ఉన్నాను.

పుస్తక ప్రపంచ డిశంబర్ 1979)